గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ

గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

నస్రుల్లాబాద్, మార్చి 30: బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థాన ప్రాంగణంలో నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, పోచారం శంభురెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

ముస్లిం మత పెద్దలతో సీఐ అశోక్

బాన్సువాడ రూరల్, మార్చి 30: రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని బాన్సువాడ సీఐ అశోక్ ముస్లిం మత పెద్దలకు సూచించారు. మండలంలోని బోర్లం గ్రామంలో ముస్లిం పెద్దలతో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగను కలిసి మెలిసి జరుపుకోవాలని సూచించారు. అనంతరం సీఐకి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సయ్యద్ నబీ, జలీల్, మహబూబ్, మెహరాజ్, అర్షద్, వాహబ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

- బృహత్ ప్రకృతి వనంలో కనుమరుగైన మొక్కలు
- ఎల్లమ్మతండాలో పది ఎకరాల్లో ఏర్పాటు
- నిప్పంటించడంతో కాలిపోయిన మొక్కలు

పనిచేయని బోరు మోటరు

లింగంపేట, మార్చి 30: లక్షల రూపాయలు వెచ్చించి బృహత్ ప్రకృతి వనం ఏర్పాటు చేసి వేలాదిగా మొక్కలు నాటితే వాటి నిర్వహణపై నిర్లక్ష్యం కారణంగా అవి అగ్నికి ఆహుతయ్యాయి. పచ్చగా కళకళలాడే మొక్కలు ఉండే చోట కాలిపోయిన మొక్కల మొదళ్లు దర్శనమిస్తున్నాయి. ఐదేండ్లక్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో ప్రకృతి వనాలతో పాటు బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. మండలంలోని ఎల్లమ్మ తండాలో సుమారు పది ఎకరాల పరిధిలో బృహత్ ప్రకృతి వనంలో 30వేలకు పైగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలు వాడి పోకుండా సకాలంలో నీటిని అందించడానికి బోరు మోటరు ఏర్పాటు చేయడంతోపాటు నీటి సరఫరా కోసం పైప్‌లైన్ వేశారు. వీటి ఏర్పాటుకు రూ.పదిలక్షలకు పైగా నిధులు వెచ్చించారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం పచ్చదనంతోపాటు నీడను ఇవ్వాల్సిన చెట్లు నేడు వాడి పోయి.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయి. బోరు మోటరు చెడిపోవడంతో నీటిని పట్టే నాథుడే కరువయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పంటించడంతో బృహత్ ప్రకృతి వనంలోని మొక్కలు కూడా కాలిపోయాయి. బోరు మోటరు చెడిపోయి నెలలు గడుస్తున్నది. బోరు బావిలో మోటరు బయటికి రాకుండా ఇరుక్కు పోవడంతో దానిపై దృష్టి సారించే వారు కరువయ్యారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన నాటి నుంచి ప్రకృతి వనంపై దృష్టి సారించే అధికారులు కరువయ్యారు. అధికారులు స్పందించి బృహత్ ప్రకృతి వనంలో ఎండి పోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బృహత్ ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన మొక్కలు (ఫైల్)

పోలీసులకు ఫిర్యాదు చేశాం..

బృహత్ ప్రకృతి వనంలో మొక్కలు కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మొక్కలు కాలిపోయాయి. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటిస్తాం. బోరు బావిలో ఇరుక్కు పోయిన మోటరు తీయించడానికి గతంలో ప్రయత్నం చేశాం. బోరు మోటరు మరమ్మతులు చేయించి బృహత్ ప్రకృతి వనం కళకళలాడే విధంగా చర్యలు తీసుకుంటాం.

- నరేశ్, ఎంపీడీవో

బృహత్ ప్రకృతి వనంలో కాలిపోయిన మొక్కలు

మొక్కలకు నీటిని పట్టడానికి పైప్‌లైన్‌లో తవ్విన కందకం(ఫైల్)

నిషేధిత అల్ప్రాజోలం నిందితుల అరెస్టు

- రూ.3.20లక్షల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- పరారీలో ప్రధాన పత్రిక విలేకరి

పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

కామారెడ్డి, మార్చి 30: నిషేధిత అల్ప్రాజోలం కలిగిన, తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సీ రాజేశ్ చంద్ర తెలిపారు. వారి నుంచి రూ.3.20లక్షల విలువైన నిషేధిత మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ గ్రామంలోని ఉదాతలవార్ సురేశ్‌గౌడ్ ఇంట్లో బిచ్కుంద పోలీసు సిబ్బంది శనివారం సోదాలు నిర్వహించారు. 110 గ్రాముల అల్ప్రాజోలం లభించగా.. అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. తాను హైదరాబాద్‌లోని నాచారంలో ఉండే దినేశ్‌కుమార్ మెహంతి వద్ద కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. బిచ్కుంద ఎస్సై తన సిబ్బందితో కలిసి నాచారంలోని టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్ వద్దకు వెళ్లి దినేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తాను బొడ్డు కృష్ణ వద్ద తక్కువ ధరకు కొని, ఇతరులకు ఎక్కువ లాభంతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కృష్ణ వద్ద కొనుగోలు చేసిన అల్ప్రాజోలంను మద్నూర్‌లోని సురేశ్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌కు విక్రయించినట్లు వెల్లడించాడు. టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్‌లో ఎనిమిది రకాల ముడి సరుకులు కొని కృష్ణ అల్ప్రాజోలం తయారు చేస్తానని కృష్ణ తెలిపాడు. దీంతో సురేశ్‌గౌడ్, దినేశ్‌కుమార్, బొడ్డు కృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్సీ తెలిపారు. ఓ ప్రధాన పత్రికలో పనిచేసే మరో నిందితుడు శ్రీనివాస్‌గౌడ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. నిషేధిత మత్తు పదారాలు అమ్మినా, సరఫరా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్సీ హెచ్చరించారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

వేల్పూర్, మార్చి 30: మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. వేల్పూర్ మండలంలోని మోతె గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాదిగ కుల సంఘ భవనం నుంచి అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పోరాటం ద్వారా వర్గీకరణ చట్టాన్ని సాధించామని అన్నారు.

నగరంలో ట్రాఫిక్ డైవర్షన్

వినాయక్‌నగర్, మార్చి 30 : రంజాన్ సందర్భంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు బస్టాండ్ నుంచి జడ్పీ నుంచి బైపాస్ రోడ్డు, అర్సపల్లి రైల్వేగేటు మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, బోధన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా కొత్త కలెక్టరేట్ బైపాస్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని, వాహనదారులు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వినాయక్‌నగర్, మార్చి 30 : నిజామాబాద్ మండల పరిధిలోని బోర్గాం(పీ) గ్రామ శివారులోని ఓ చెట్టు కింద పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.44,720 నగదు, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అదృశ్యమైన మహిళ మృతి

రుద్రూర్, మార్చి 30 : రుద్రూర్ మండలంలోని లింగంపల్లి శివారులో ఆదివారం లక్ష్మీబాయి(62) మృతదేహం లభ్యమైంది. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన దెగావత్ లక్ష్మీబాయి కుమారుడు నాలుగేండ్ల క్రితం మృతిచెందాడు. అప్పటినుంచి ఆమె మతిస్థిమితం సరిగ్గా లేక బాధపడుతుండేది. ఈ నెల 26న రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు కోటగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రుద్రూర్ మండలం లింగంపల్లి శివారులోని పొలం వద్ద మహిళ మృతదేహం ఉందని సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు.. అక్కడికి చేరుకొని ఆ మృతదేహం లక్ష్మీబాయిదిగా గుర్తించారు. మానసికస్థితి సరిగా లేకపోవడంతోనే మృతిచెందిందని, మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతురాలి భర్త లింబ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు రుద్రూర్ ఎస్సై తెలిపారు.

ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ధ్వజారోహణ

రామారెడ్డిలో ధ్వజారోహణ చేస్తున్న ఆర్య సమాజ్ అధ్యక్షుడు హరినాథ్

రామారెడ్డి, మార్చి 30 : మండల కేంద్రంలో ఆదివారం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని ఓం జెండాను అధ్యక్షుడు గుండ హరినాథ్ ఎగురవేశారు. నూతన సంవత్సరానికి సంబంధించిన వేద మంత్రాలతో యజ్ఞం నిర్వహించారు. ఆర్య సమాజ్ తరపున మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ సభ్యులు లక్ష్మాగౌడ్, పడిగెల శ్రీనివాస్, నవీన్, మిఠాయి గంగారాం, గుండ ఉమాకాంత్, అంగులూరి ప్రకాశ్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ జెండా ఆవిష్కరణ

పెద్దకొడప్‌గల్ (పిట్లం),మార్చి 30 : పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల్లోని పలు గ్రామాల్లో ముదిరాజ్ జెండాను ముదిరాజ్ సంఘ సభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ రోజున పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి జెండాను ఆవిష్కరిస్తామని సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బోయిని అంజయ్య, కిష్టయ్య, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

కోమలంచ గ్రామంలో..

నిజాంసాగర్, మార్చి 30 : మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో ఉదయం 11 గంటలకు ముదిరాజ్ సంఘ భవనం వద్ద ఉగాదిని పురస్కరించుకొని గ్రామ ముదిరాజ్‌లు పెద్దమ్మ తల్లికి పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోచయ్య,కోశాధికారి లక్ష్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్, మార్చి 30 : మండలంలోని బేగంపూర్, కాస్లాబాద్, అంజనీ, శివాపూర్, తలాబ్‌తండా, పోచారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు హైమద్, నాగు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

పెద్దకొడప్‌గల్ (పిట్లం),మార్చి 30 : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రణ చేయవచ్చని బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్ అన్నారు. పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామంలో ప్రధాన వీధులు, చౌరస్తాల్లో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్తుల సహకారంతో గ్రామంలో పది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులను ఆయన అభినందించారు.

నేడు ముంబాజీపేటలో కుస్తీ పోటీలు

లింగంపేట, మార్చి30: మండలంలోని ముంబాజీపేట గ్రామంలో సోమవారం సాయంత్రం కుస్తీ పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామ కార్యదర్శి పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామంలో కుస్తీ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీల్లో విజేతకు రెండు తులాల వెండి కడియం అందించనున్నట్లు తెలిపారు.

'విశ్వావసు'కు ఘన స్వాగతం

- ఊరూరా ఉగాది సంబురాలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- పచ్చడి సేవించిన ప్రజలు

లింగంపేట మత్తడి పోచమ్మ ఆలయం వద్దకు తరలివెళుతున్న ఎడ్ల బండ్లు

మద్నూర్‌లో నరేంద్ర మహరాజ్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నాగిరెడ్డిపేటలో ఎండ్లబండ్ల ప్రదర్శన

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 30: తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఉదయాన్నే లేచి వాకిళ్లలో కల్లాపి చల్లారు. స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఇండ్లకు మామిడి తోరణాలు కట్టారు. పచ్చడి తయారు చేసి సేవించారు. తీపి వంటకాలు చేసి ఆరగించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించగా.. వచ్చే ఏడాది పాటు తమ జాతకం ఎలా ఉందో తెలుసుకున్నారు. ఆర్యసమాజ్‌లలో యజ్ఞం నిర్వహించారు. పలు గ్రామాల్లో చేపట్టిన ఎడ్ల బండ్ల ప్రదర్శన ఆకట్టుకున్నది. కామారెడ్డి కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్, టీజీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సంబురాల్లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పాల్గొన్నారు. వేద పండితుడు గంగవరపు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాధ్యక్షుడు చక్రధర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ గణేశ్, టీజీవో అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో టౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బాన్సువాడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పచ్చడి వితరణ చేపట్టారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొన్నారు. రాజంపేట, బస్వన్నపల్లి, ఆర్గొండ, దోమకొండ, భిక్కనూరు గ్రామస్తులు ఎండ్ల బండ్ల ప్రదర్శన, జాతర నిర్వహించారు. పెద్దాయిపల్లిలో జడకొప్పు, కోలాటం ఆడారు. బీబీపేట్‌లో మున్నూరుకాపు కులస్తులు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు, అనంతరం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయం చుట్టూ చుక్కాపూర్, లక్ష్మీరావులపల్లి, ఇసాయిపేట, బండ రామేశ్వర్‌పల్లి గ్రామస్తులు ఎడ్ల బండ్లను తిప్పారు.

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా ఎల్లారెడి పట్టణంలో ప్రతి ఇల్లు పచ్చని తోరణాలతో కళకళలాడుతూ కనిపించింది. ప్రజలందరూ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఊరడమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు ముత్యాల పోచమ్మ తల్లికి ఒడిబియ్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో ఉగాది పచ్చడి వితరణ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా తీసుకున్న కొత్త వాహనాలకు పూజలతో పట్టణంలోని అయ్యప్ప స్వామి, నీలకంఠేశ్వర ఆలయాలు సందడిగా మారాయి. మద్నూర్ మండలంలో ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇంట్లో పచ్చడి సేవించి పండుగను జరుపుకున్నారు. ఆర్యసమాజ్‌లో యజ్ఞం నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ జగద్గురు నరేంద్రచార్య మహారాజ్, భక్తులు శోభాయాత్ర నిర్వహించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల్లో పురోహితులు పంచాగ పఠనం చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో చైర్మన్ రాంపటేల్ ఆధ్వర్యంలో పంచాగ పఠనం నిర్వహించారు. బిచ్కుంద మండలంలో ఉగాది సంబురాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయంలో మఠాధిపతి సోమయప్ప స్వామి ఆధ్వర్యంలో గ్రామ పురోహితుడు గజానన్ పంతులు పంచాంగ శ్రవణం చేశారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలోని నల్ల పోచమ్మ అమ్మవారికి ట్రాక్టర్ల ప్రదక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ట్రాక్టర్ల ప్రదర్శనను తిలకించారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండగను ఘనంగా నిర్వహించారు. షడ్రుచులతో కూడిన పచ్చడిని సేవించారు. మండలంలోని మెంగారం, లింగంపల్లి, పోల్కంపేట, శెట్పల్లిసంగారెడ్డి, భవానీపేట, మోతె, కోమట్‌పల్లి, పోతాయిపల్లి, పర్శుళ్ల, ముంబాజీపేట తదితర గ్రామాల్లో వేద బ్రాహ్మణులు పంచాంగ శ్రవణం వినిపించారు. మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద సాయంత్రం ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని హనుమాన్ మందిరాల వద్ద ఉగాది పర్వదినం పురస్కరించుకొని వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని తయారు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని నల్ల పోచమ్మ ఆలయం ఉగాది జాతర సందర్భంగా ఎండ్ల బండ్ల ప్రదర్శన కన్నుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, రైతు నాయకుడు నర్సింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రావు జెండా ఊపి ఎడ్లబండ్ల ప్రదర్శన ప్రారంభించారు.

గంగమ్మవాగు వంతెన త్వరగా పూర్తి చేయాలని వినతి

రామారెడ్డిలో స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి మార్చి 30 : మండంలోని ఇసన్నపల్లి-రామారెడ్డి గ్రామాల్లో వెలసిన శ్రీ కాలభైరవస్వామిని ఉగాది పర్వ దినాన స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదివారం దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఉభయ ఆలయాల శ్రీ సీత రామచంద్రస్వామి-రాజరాజేశ్వరస్వామి బ్రహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణకు వెళ్లిన ఎమ్మెల్యేను బీఆర్ఎస్ నాయకులు కలిశారు. గ్రామంలో అర్థాంతరంగా నిలిచిపోయిన గంగమ్మవాగు వంతెన పనులు ప్రారంభించి వర్షాకాలం వరకు పూర్తి చేయాలని ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. వంతెన పూర్తికాకపోవడంతో 15 గ్రామాల ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని విన్నవించారు. వర్షాకాలం వరకూ పూర్తి చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడుతామన్నారు. గతంలో రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలుసార్లు నిరసనలు సైతం చేశామని గుర్తు చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్ గుప్తా, మండల మాజీ ప్రధాన కార్యదర్శి ల్యాగల మహిపాల్, కడెం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సంతలో జేబుదొంగల చేతి వాటం

- మైనర్‌తో చోరీలు

లింగంపేట, మార్చి 30: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే సంతలో జేబు దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సంతకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, వ్యాపారులు కాకుండా ఎల్లారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి, బాన్సువాడ, గాంధారి తదితర మండలాలకు చెందిన వ్యాపారులు సైతం వస్తుంటారు. సంత సందడిగా ఉండడంతో జేబు దొంగలు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. గత శుక్రవారం సంత కు వచ్చిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి నాలుగు ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లు పోయినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతలో ఫోన్లు చోరీ చేయడానికి ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తెలిపారు. చోరీ చేయడానికి వచ్చే వారు మైనర్లతో చోరీలు చేయిస్తున్నారు. గత శుక్రవారం సంతలో సెల్ ఫోన్ చోరీ చేస్తుండగా మైనర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు ఆలస్యంగా తెలిసింది. సదరు బాలుడు తల్లిదండ్రుల సమాచారం ఇవ్వక పోవడంతో కామారెడ్డి పట్టణంలోని బాలసదన్‌కు తరలించినట్లు సమాచారం. స్థానిక పోలీసులు సంతలో బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ చేస్తున్న సభ్యులు

నిజాంసాగర్, మార్చి 30 : మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటీల్, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు, చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు చీరల పంపిణీ

లింగంపేట, మార్చి30: మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు హైకోర్టు న్యాయవాది మోహిఅహ్మద్ ఖాద్రీ సతీమణి ఇస్రతున్నీసా బేగం దుస్తులు పంపిణీ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా లింగంపేటలోని స్వగృహంలో సుమారు ఆరు వందల మందికి చీరలతో పాటు నగదు పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా తోఫాలు అందించిన న్యాయవాది కుటుంబ సభ్యులకు ముస్లిం మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

కారు బోల్తా : పలువురికి గాయాలు

రామారెడ్డి (సదాశివనగర్)మార్చి30 : సదాశివనగర్ మండలం కుప్రియాల్ వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డుప్రమాదంలో కారు బోల్తాపడి పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా లక్ష్మణచందా గ్రామానికి చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యుడికి వీడ్కోలు పలికి తిరిగి గ్రామానికి కారులో బయల్దేరారు. సదాశివనగర్ మండలం కుప్రియాల్ స్టేజీ వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడి రోడ్డు కిందకు దూసుకుపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న కొమ్ము రాజేశ్వర్, రాజశేఖర్, జ్యోతి, రాజ్యలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షత గాత్రులను స్థానికులు 108 అంబులెన్సులో కామారెడ్డి జిల్లా దవాఖానకు తరలించారు. నిద్రమత్తులో ఉండడంతోనే ప్రమాదం సంభవించ